క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరంలో 158 మందికి పరీక్షలు



గుంటూరు వెస్ట్: ఉద్యోగులు, వృద్ధుల కోసం స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమయ్యిందని ఏపీ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరంలో 158 మందికి దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. దీని కోసం తమ కర్తవ్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయచంద్ర, అసోసియేషన్ నాయకులు సుధాకర్‌బాబు, డి.కృష్ణమూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

11న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 11న నిర్వహించనున్నట్లు సెక్రటరీ సంపత్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో జరిగే సమావేశంలో అధికారులు, కార్పొరేటర్లు, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

శక్తి ఉమెన్ ఐకాన్ అవార్డ్స్ లోగో ఆవిష్కరణ



పాత గుంటూరు: వివిధ రంగాల్లో వృత్తిపరంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. శరవణ సంస్థ సహకారంతో ఎస్‌ఆర్ మీడియా ఆధ్వర్యంలో మార్చి ఒకటో తేదీన అమరావతిలో నిర్వహించనున్న శక్తి ఉమెన్ ఐకాన్ అవార్డ్స్ లోగోను గురువారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా డెప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. ఎస్‌ఆర్ మీడియా చైర్మన్ జి. రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ, వైద్య, విద్య, పోలీస్, మీడియా, సినిమా, క్రీడ, పారిశ్రామిక రంగాల్లో ప్రతి విభాగానికీ తొమ్మిది అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. వత్తిపరంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శరవణ ఎండీ రవిచంద్ర, సీఈవో డి. శ్రీనాథ్, పి. దుర్గాభవాని, జి.లత పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళినగర్‌కు చెందిన ముప్పాళ్ల సాంబశివరావుకు, వల్లూరి వంశీకి మధ్య రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం చంద్రమౌళినగర్ జీరో లైనులో వల్లూరి వంశీ, అతని అనుచరుడు కలసి ముప్పాళ్ల సాంబశివరావుపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఈనెల 9న మార్కెట్ సెంటర్లోని కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేఘాలయకు చెందిన ఐపీఎస్ అధికారి జీహెచ్‌పీ రాజు ముఖ్య అతిథిగా హాజరు కానున్న సమావేశంలో భాగంగా కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ కేత సుబ్రహ్మణ్యశాస్త్రి, పరమాత్ముని దత్తప్రసాద్, కాకరపర్తి ప్రభాకర్‌ను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని, సమావేశానికి పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. వివరాలకు సంఘ కార్యదర్శి కేవీఎస్ దుర్గాప్రసాద్‌ను 98481 10174 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉభయ దాతలుగా దంపతులు దండిభట్ల కృష్ణ కిశోర్, జయశ్రీ, త్రిపురమల్ల వెంకటేశ్వర్లు, నిర్మల, పొన్నలూరి సీతారామాంజనేయులు, సీతారత్నకుమారి, నూకల సాంబశివరావు, భవాని వ్యవహరించారు. కార్యక్రమాన్ని అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవనకుమార్ శర్మ,, మల్లికార్జున శర్మ చక్రపాణి, వాసు పర్యవేక్షించారు.

నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



ఆంజనేయపేటలోని సచివాలయం వద్ద నవరత్నాల ప్రగతి వివరాల డిస్‌ప్లేను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజల తలరాతలు మార్చే మహత్తరమైన నవరత్నాల పథకాల అమలు ద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 19వ డివిజన్‌లోని నల్లచెరువు, 44వ డివిజన్‌లోని ఆంజనేయపేట 3వ లైనులో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలసి ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ 64, 138 వార్డు సచివాలయల్లో నవరత్నాల లబ్ధికి సంబంధించిన ప్రగతి వివరాలతో డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ మద్దతు తీసుకున్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించి, చివరి లబ్ధిదారునికి సైతం పథకాలు అందుతున్నదీ, లేనిదీ నిర్ధారించుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తారీఖునే రూ.2,750 పెన్షన్ ఇచ్చి వృద్ధులకు మనువడిలా సీఎం వై.ఎస్. జగన్ అండగా నిలిచి, ఆదుకుంటున్నారని చెప్పారు. అక్కాచెల్లెమ్మలకు అమ్మఒడి ద్వారా రూ.15వేలు ఇస్తూ ఒక అన్నలా, తమ్ముడిలా పిల్లల్ని చక్కగా చదివించేందుకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ఇస్తున్నారని తెలిపారు. ఇంటి స్థలాలు పంపిణీతో పాటు పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు, పాలనా వికేంద్రీకరణ, సమతుల అభివృద్ధి కోసం మూడు రాజధానుల ఏర్పాటు వరకు, తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తు కోసమే అని వివరించారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో వందలాదిగా ఉన్న లబ్ధిదారులే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సాక్ష్యమని పేర్కొన్నారు.

నవరత్నాల లబ్ధిదారులే సాక్ష్యం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ స్వయంగా రూపకల్పన చేసి, అమలు నవరత్నాలను పొందుతున్న లబ్ధిదారులే ప్రభుత్వ అద్భుత పాలనకు సాక్ష్యాలుగా నిలిచారని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో తిరుగులేని ఆదరణ సంపాదించుకున్న ఆయనపై ప్రజల్లో అంతులేని నమ్మకం కుదిరిందన్నారు. ప్రజారంజక పరిపాలన కొనసాగించేందుకు వచ్చే ఎన్నికల్లో సీఎంగా మరలా ఆశీర్వదించాలని కోరారు.

రాజకీయాలకు తావులేని విధంగా సంక్షేమ ఫలాలు

డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు, రాజకీయాలకు తావులేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి చేకూర్చడంపై ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమాల్లో తేలుకుంట్ల హనుమాయమ్మ, వంగల హేమలత, నాయకులు టెంట్‌హౌస్ బాబు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గుడిపాటి భాస్కర్, ఎండీ. బాబూఖాన్, కామిరెడ్డి రంగారెడ్డి, కూరపాటి రామరాజు, పల్లపు మహేష్, ఖాజా మొహిద్దీన్, బాలిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, యద్దనపల్లి బాలరాజు, కామిశెట్టి మధు, పోకల వీరభద్రరావు, చిలకా సురేష్, రజియా బేగం, గంగా, సుబ్బారావు, సుబ్బు, రత్నకుమారి పాల్గొన్నారు.

బోధన నైపుణ్యాల్ని మెరుగు పరచుకోవాలి

డీవైఈవో పి. వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న గుంటూరు డీవైఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాల్ని అభివృద్ధి పరచుకోవాలని గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల్ని గురువారం సందర్శించిన డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోధనలో కాలానుగుణంగా ఆధునిక పద్ధతుల్ని ప్రవేశపెడుతున్న ప్రభుత్వం, ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని చెప్పారు. అత్యుత్తమ మెటీరియల్‌తో పాటు బోధనలో నిపుణులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసి అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం, ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్య అందిస్తోందని తెలిపారు. డ్యూయల్ లాంగ్వేజ్ పాఠ్య పుస్తకాలతో ఉర్దూతో పాటు ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాల్ని ముద్రించి, అత్యుత్తమ బోధన అందిస్తోందని చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. శిక్షణా తరగతుల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బీవీ రమణయ్య, ఎస్వీ ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-16 క్రికెట్‌లో నగర విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: కర్నూలు జిల్లా గార్గేయపురంలో ఈనెల 25, 26 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అండర్ ఆర్మ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టీ-20 అండర్-16 క్రికెట్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నుంచి లోటస్ హైస్కూలుకు చెందిన ఆరుగురు విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణనగర్‌లోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో పోటీపడిన 11 జట్లతో తలపడిన తమ విద్యార్థులు ప్రత్యర్థి ప్రకాశం జిల్లా జట్టుపై ఆరు ఓవర్లలోనే విజయం సాధించారని పేర్కొన్నారు. నాణ్యమైన బోధనతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, క్రికెట్ కోచ్ పవన్ చక్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీయ నిర్ణయాలే జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయి

భాష్యం రామకృష్ణ



టెన్త్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: మనం తీసుకునే నిర్ణయాలే జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని, మన చర్యలే ఉత్తమ భవిష్యత్తుకు నాంది పలుకుతాయని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గోరంట్లలోని భాష్యం టెన్త్ క్యాంపస్‌లో గురువారం పదో తరగతి విద్యార్థుల్ని పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో కీలకమని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలను అనుసరించి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. స్వీయ ప్రేరణతో మంచీ, చెడుల విచక్షణ గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. పరీక్షల వేళ ప్రణాళికాబద్ధంగా దినచర్యను రూపొందించుకుంటే, ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని సూచించారు. ఇందుకు ఎంతో మంది మహనీయులు ప్రేరణగా నిలిచారని వివరించారు. విద్యార్థి దశ అన్ని భావోద్వేగాల కలయిక అని, దాన్ని ఏ విధంగా మలచుకుంటారనేది తమ చేతుల్లోనే ఉందని విద్యార్థులకు ఉద్బోధించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ, వారిలో మనోధైర్యాన్ని నింపుతూ ప్రతి ఒక్క విద్యార్థితో ఫొటోలు దిగారు. టెన్త్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏటా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి క్యాంపస్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారుడు మైఖేల్‌రాజు, జెడ్‌ఈవోలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బేతపూడిలో కమ్యూనిటీ హాలు ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో రూ 1.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకుని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వేదికతో పాటు విశ్రాంత రూమ్‌లు, చుట్టూ ప్రహరీ, పచ్చదనంతో పరచుకున్న మొక్కలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ , ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హాజరై ప్రారంభించనున్నారు. ఇళ్లలో చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీ హాల్ నిర్మించి తమ కలను ఎమ్మెల్యే ఆర్కే నిజం చేశారని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

ఫిరంగిపురం: సాలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ మందిరంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ వై. యల్లారెడ్డి గురువారం తెలిపారు. అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వ్రతంలో 108 జంటలు పాల్గొంటాయని ఆయన చెప్పారు.

'జన్-ధన్' యోజన ఖాతాల పాస్ బుక్‌ల పంపిణీ

గుంటూరు మెడికల్: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి కత్తి మేరీ సరోజిని ఆధ్వర్యంలో ప్రధాన్ మంత్రి జన్-ధన్ (పీఎంజేడీ) యోజన బ్యాంకు పాస్ పుస్తకాల్ని గురువారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఖాతాదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంజేడీ ఖాతాల్లో కనీస నిల్వను నిర్వహించాల్సిన అవసరం లేదని, డిపాజిట్‌పై వడ్డీ వస్తుందని తెలిపారు. ఖాతాదారునికి రూపే డెబిట్ కార్డ్‌తో పాటు ప్రమాద బీమా రూ. 2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, వై.వి.సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మనాభం, జిల్లా కార్యదర్శి సుగుణ, ఏలూరిలక్ష్మి, రమాదేవి, బీజేపీ మండల అధ్యక్షులు రామచంద్రరావు, సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు, ప్రధాన్ మంత్రి జన్-ధన్ ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి తెలిపారు.కుంచనపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం స్థానిక నాయకులతో కలసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ గత మూడు, నాలుగు రోజుల నుంచి టీడీపీ, జనసేన నాయకులు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రిగా ఉన్న నారా లోకేష్ ప్రాతినిధ్యం వహించిన మంగళగిరి నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ఆర్కే ఎంత అభివృద్ధి చేశారో టీడీపీ నేతలు గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలని ఆయన తెలిపారు.కుంచనపల్లిలో పేదవర్గాలకు చెందిన ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి కోటి రూపాయలకు పైగా వెచ్చించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రాతూరు అండర్ పాస్ నుంచి నూతక్కి వరకు డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కుంచనపల్లిలో ప్రధాన రహదారిలో రాకపోకలకు కష్టంగా ఉండడంతో అన్ని పార్టీ నాయకులతో మాట్లాడి వారి సొంత భూములను తీసుకుని నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా సభ్యుడు అమరా నాగయ్య, కుంచనపల్లి పార్టీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం తాతయ్య, బిరుదుగడ్డ విజయేంద్రరావు, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుతోనే మంచి ప్రభుత్వాల ఎన్నిక

మోతడక(తాడికొండ): ఓటు హక్కు ద్వారానే ప్రజాస్వామ్యంలో మంచి ప్రభుత్వాల్ని ఎన్నుకోవచ్చని తాడికొండ తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు తెలిపారు. మోతడక సీబీటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ద్వారా 254 మంది విద్యార్థుల్ని ఓటర్లుగా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డి. శంకరరావు, వైస్ ప్రిన్సిపాల్ కె. నాగ శ్రీనివాసరావు, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి వి.వి. సుబ్బారావు, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో జాన్ సైదా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ భేష్!



కేంద్ర ప్రభుత్వ బృందంతో ఈమని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

- పీఎంవీవీవై పథకం అమలు అత్యుత్తమం
- యర్రబాలెం వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ అభినందనీయమని కేంద్ర బృందం ప్రశంసించింది. నగర పరిధిలోని యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పరిశీలన బృందం సందర్శించింది. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంవీవీవై) పథక అమలును పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లోని పలు విభాగాల్ని పరిశీలించి రోగులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు పీఎంవీవీవై పథకం సొమ్ము జమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురికి ప్రత్యక్షంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు ఈశ్వర్ దత్, సుమిత్ కుమార్, డాక్టర్ చిత్ర, కోకిల, యర్రబాలెం హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ఈమని పీహెచ్‌సీ సందర్శన

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం పరిశీలించింది. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు తీరుపై పలువురు గర్భిణులతో చర్చించారు. అనంతరం పీఎంఎంవీవై యస్‌వో డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నిధులు పక్కదోవ పట్టకుండా గర్భిణులకు అందుతున్నాయని తెలిపారు.

ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు ఘన స్వాగతం



ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, నేతలు

కొరిటెపాడు(గుంటూరు): సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి ఈ నెల 8న పాదయాత్రగా బయలుదేరిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తన అనుచరులతో కలసి గురువారం గుంటూరు మిర్చి యార్డు వద్దకు చేరుకున్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కాకుమాను మండలం జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ బేగం తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జై జగన్... జై జై జగన్ నినాదంతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం కొద్ది దూరం ఆయనతో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుతూ విజయనగరంలోని ఎస్.కోట నుంచి తిరుపతికి 820 కిలోమీటర్ల దూరాన్ని 43 రోజుల్లో పూర్తి చేయాలన్న సంకల్పంతో పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 23 రోజులు పాదయాత్ర పూర్తయ్యిందని చెప్పారు. డిసెంబర్ 21న జగనన్న పుట్టిన రోజు నాటికి తిరుపతి చేరుకుంటామని తెలియజేశారు. గుంటూరు మార్కెట్ యార్డు డైరెక్టర్లు పలకలూరు ఇంద్ర, పార్టీ నాయకుడు దాసరి రాజు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్‌లో మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు జన్మదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మేయర్‌తో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

చక్రనాగ్‌కు డైనమిక్ లీడర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న చక్రనాగ్

గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ ఇండిపెండెన్స్ స్కూల్ అలయెన్స్ (నీసా) ఆధ్వర్యంలో గురువారం హరియాణాలోని చండీగఢ్‌లో జరిగిన స్కూల్ లీడర్స్ సమ్మిట్-2023లో గుంటూరు నగరానికి చెందిన ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ ఎన్. చక్రనాగ్ జాతీయస్థాయిలో అవార్డు అందుకున్నారు. నీసా చైర్మన్ కులభూషణ్ శర్మ, హరియాణా స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వీపీ యాదవ్ ''డైనమిక్ లీడర్'' అవార్డుతో సత్కరించినట్లు చక్రనాగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా జాతీయస్థాయిలో అవార్డుతో సత్కరించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఈ-శ్రమ కార్డులతో కార్మికులకు పలు ప్రయోజనాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శేఖర్

గుంటూరు ఈస్ట్: ఈ-శ్రమ కార్డులతో కార్మికులకు పలు ప్రయోజనాలున్నాయని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.శేఖర్ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సౌజన్యంతో ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో నల్లచెరువు లారీ స్టాండ్‌లో అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ పథకాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శేఖర్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్డు ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షలు ప్రమాద బీమా చెల్లిస్తుందని చెప్పారు. రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్మికుడు తప్పక ఈ-శ్రమ కార్డును కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇండియా లేబర్ లైన్ ప్రతినిధులు మాధవరావు, ఈశ్వరరావు, లారీ స్టాండ్ యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వానికి పేరు తేవాలి



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ఆస్పత్రి ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి పేరు తేవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మందుల కేంద్రంలో ఫార్మాసిస్ట్‌గా పని చేస్తున్న కృష్ణకుమారి పదోన్నతిపై ఒంగోలు వెళుతున్న సందర్భంగా గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్, సహచర సిబ్బంది ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కృష్ణకుమారి రూ. 10వేలను అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని, రాధారాణి పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సచివాలయం ఎదురుగా అనుమతుల్లేకుండా భవన నిర్మాణం జరుగుతున్నా సచివాలయ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. నగర కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె. హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. లక్ష్మీపతిరావు గురువారం భవనాన్ని సందర్శించి అనుమతులు గురించి వివరాలు సేకరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది విధుల నిర్వహణతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని తెలిపారు.